ప్రజా పాలనను సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యేలు అహ్మద్ బలాల, దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిల సూచన
- ఎల్‌బీనగర్‌లో 11 వార్డుల్లో 44 కేంద్రాల ఏర్పాటు


మలక్‌పేట సర్కిల్ కార్యాలయంలో అధికారులతో ఎమ్మెల్యే బలాల


మాట్లాడుతున్న ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

చాదర్‌ఘాట్: ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. బుధవారం మలక్‌పేట సర్కిల్–6 కార్యాలయంలో డీసీ జయంత్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. జనవరి 6 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. అన్ని శాఖల అధికారులు అన్ని డివిజన్‌లలో పర్యటించి ఆరు గ్యారంటీలకు దరఖాస్తులను తీసుకోవాలని సూచించారు.

- దరఖాస్తు చేసుకున్న ప్రతి ఫిర్యాదుదారుడికి రసీదు ఇవ్వాలని, ఆరు గ్యారంటీలే కాకుండా ఇంకేమైనా సమస్యలుంటే దరఖాస్తులను కూడా స్వీకరించాలని అధికారులకు మలక్‌పేట సర్కిల్–6 స్పెషల్ అధికారి ఎ.కృష్ణ సూచించారు.
- మైనార్టీలు అధికంగా ఉన్నచోట ఉర్దూలో కూడా ఫారాలు ఇవ్వాలని అధికారులకు సర్కిల్–6 డీసీ జయంత్ సూచించారు. కార్పొరేటర్లు, ఎంటమాలజీ, శానిటేషన్, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

అర్హులు సద్వినియోగం చేసుకోవాలి..

చైతన్యపురి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభయహస్తంలో దరఖాస్తు చేసుకుని అర్హులైన పేదవారు సద్వినియోగం చేసుకోవాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. కొత్తపేటలోని జీహెచ్‌ఎంసీ ఈస్ట్ జోనల్ కార్యాలయంలో అధికారులతో అభయహస్తంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌లో అభయహస్తం గ్యారంటీల దరఖాస్తులు స్వీకరణ గురువారం నుంచి వచ్చేనెల 6వ తేదీ వరకు ఉంటుందన్నారు. డివిజన్‌లలో 92 కేంద్రాలు ఏర్పాటు చేశామని, జీహెచ్‌ఎంసీ, పలు విభాగాల అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. ఎమ్మెల్సీలు యెగ్గె మల్లేశం, బొగ్గారపు దయానంద్‌గుప్తా, కార్పొరేటర్లు దర్పెల్లి రాజశేఖర్‌రెడ్డి, పవన్‌కుమార్, రంగా నర్సింహగుప్తా, బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, జోనల్ కమిషనర్ పంకజ, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ప్రజలందరికీ సంక్షేమ పథకాలు..

నాగోలు: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అన్ని రకాల సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందేలా ఉండాలని తెలంగాణ గాడ్దే రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెద్దవూరే బ్రహ్మయ్య అన్నారు. బుధవారం నాగోలు డివిజన్ సాయినగర్‌కాలనీలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అందరికీ అన్ని రకాల సంక్షేమ పథకాలకు రేషన్‌కార్డును ప్రాతిపదికను తీసుకోవడంతో రేషన్ కార్డులేని అనేక లక్షల మంది పేదకుటుంబాలకు సంక్షేమ పథకాలు అందకుండా పోయే ప్రమాదం ఉందన్నారు. రాష్ట్రంలో 10 లక్షల రేషన్‌కార్డులు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. మరో 2 లక్షలమంది దరఖాస్తు చేయని వారు ఉన్నారని వీరందరికీ సంక్షేమ పథకాలు దూరమయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. తెల్లరేషన్ కార్డు దరఖాస్తు చేసుకోవడానికి మరింత సమయం కేటాయించాలని కోరారు. సంఘం నాయకులు గిరి, వెంకటేష్, శంకర్, రాములు, నరసింహ, నర్సింగ్‌రావు, ప్రవీణ్, రేణుక, గీత, మంజుల, లలిత, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలను వినియోగించుకోవాలి

వనస్థలిపురం : కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభయహస్తం, ఆరు గ్యారంటీలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆ పార్టీ వనస్థలిపురం డివిజన్ అధ్యక్షుడు కుట్ల నర్సింహా యాదవ్ తెలిపారు. సంక్షేమ పథకాలు ప్రజల వద్దకే చేరేటట్లుగా ప్రజాపాలనలో భాగంగా వనస్థలిపురం డివిజన్ ఎఫ్‌సీఐ కాలనీలోని వార్డు కార్యాలయం, వనస్థలిపురం కాంప్లెక్స్, శ్రీనివాసపురం కాలనీ కమ్యూనిటీ హాల్, ప్రశాంత్‌నగర్ కాలనీ కమ్యూనిటీహాల్‌లో దరఖాస్తుల స్వీకరణకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాట్లు చేసినట్లు ఆయన వివరించారు. ప్రభుత్వ ప్రతినిధులు మీ ఇంటి వద్దకు వచ్చి ఫారమ్‌లు, స్లిప్‌లు ఇస్తారని ఆయన తెలిపారు. అర్హులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎల్‌బీనగర్‌లో నేటి నుంచి ప్రజాపాలన..

చైతన్యపురి: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చేరువగా పాలన అందించేందుకు గురువారం నుంచి వచ్చేనెల ఆరో తేదీ వరకు ప్రజాపాలన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జీహెచ్‌ఎంసీ ఈస్ట్ జోనల్ కమిషనర్ పంకజ తెలిపారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గ పరిధిలోని 11 వార్డుల్లో మొత్తం 44 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అభయహస్తం ఆరు గ్యారంటీలలో భాగంగా అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు ప్రతి వార్డులో నాలుగు ప్రాంతాల్లో సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. ప్రజాపాలన కార్యక్రమానికి సర్కిళ్ల వారీగా హయత్‌నగర్ సర్కిల్‌కు జీహెచ్‌ఎంసీ చీఫ్ వాల్యుయేషన్ ఆఫీసర్ మహేష్ కులకర్ణి, ఎల్‌బీనగర్ సర్కిల్‌కు హౌసింగ్, లేక్స్ ఓఎస్‌డీ కె.సురేష్ కుమార్, సరూర్‌నగర్ సర్కిల్‌కు యూసీడి అడిషనల్ కమిషనర్ చంద్రకాంత్‌రెడ్డిలను స్పెషల్ ఆఫీసర్లుగా నియమించామని జోనల్ కమిషనర్ పేర్కొన్నారు. ప్రతి సెంటర్‌లో నాలుగు కౌంటర్లు ఉంటాయని, రెండు మహిళలకు, ఒకటి జనరల్, మరోటి ఇతర అభ్యర్థనలను స్వీకరిస్తామన్నారు. అన్ని కేంద్రాల్లో ప్రజలకు అవసరమైన తాగునీరు, టెంట్లు, సౌండ్ సిస్టం వంటివి ఏర్పాటు చేశామన్నారు.

మలబార్ 'మైన్' డైమండ్ ఆభరణాల ప్రదర్శన


వజ్రాభరణాల ప్రదర్శన ప్రారంభిస్తున్న మహిళలు

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్ చైతన్యపురిలోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్ షోరూంలో 'మైన్' డైమండ్ ప్రత్యేక ఆభరణాల ప్రదర్శనను బుధవారం సాయంత్రం ప్రారంభించారు. వినియోదారులు అమూల్య, పూజ, ఇంద్రజ, ఝాన్సీ, చందన, పుష్ప చేతుల మీదుగా వజ్రాభరణాల ప్రదర్శన ప్రారంభించినట్లు షోరూం హెడ్ రతీష్‌కుమార్ తెలిపారు. రోజూ ధరించే నగలు, వివాహ ఆభరణాలు, లైట్‌వెయిట్ ఆభరణాలు, పురుషుల ఆభరణాలు, ప్లాటీనం ఆభరణాలు అందుబాటులో ఉంచినట్లు ఆయన తెలిపారు. ఈ ప్రదర్శన డిసెంబర్ 31 వరకు ఉంటుందన్నారు. పాతమైన్ డైమండ్ ఆభరణాల మార్పిడిపై 100 శాతం విలువను పొందే అవకాశం, కొత్తగా కొనుగోలు చేసే డైమండ్ విలువపై 25 శాతం తగ్గింపు కల్పిస్తున్నామన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ


కాంగ్రెస్ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జ్ జక్కిడి ప్రభాకర్‌రెడ్డి

మన్సూరాబాద్: మన్సూరాబాద్ అయ్యప్ప స్వాముల ఆధ్వర్యంలో మన్సూరాబాద్‌లో అయ్యప్ప మహాపడిపూజ మహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ మహోత్సవానికి టీపీసీసీ ప్రతినిధి, కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జ్ జక్కిడి ప్రభాకర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. నాయకులు సత్యనారాయణ, గంట శ్రవణ్, ఎంజాల రమేష్, నాంపల్లి శంకరయ్య, అశోక్ తదితరులున్నారు.

రైతుబజార్‌లో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు (కిలో/రూపాయల్లో..) టమాటా రూ.21, వంకాయ రూ.55, బెండకాయ రూ.50, పచ్చిమిర్చి రూ.45, కాకరకాయ రూ.71, బీరకాయ రూ.45, కాలిఫ్లవర్ 23, క్యాబేజీ 16, క్యారెట్ 40, దొండకాయ రూ.60, ఆలుగడ్డ రూ.21, ఉల్లిగడ్డ రూ.24, గోకరకాయ 60, దోసకాయ రూ.28, సొరకాయ రూ.17, పొట్లకాయ రూ.18, అరటి 09, చిక్కుడు 70, అర్వి 50, మునగ 95, చిలగడదుంప 45, బీట్‌రూట్ 25, కీర 13, ఫ్రెంచ్ బీన్స్ 45, కాప్సికమ్ రూ.70గా ఉన్నాయి. ఈ ధరలు గురువారం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

మూసారంబాగ్ బ్రిడ్జిని సందర్శించిన ఎమ్మెల్యే


ఎమ్మెల్యే బలాలకు సమస్యను వివరిస్తున్న అండర్‌సైన్డ్ ప్రాపర్టీ యాజమానులు

నమూనాను మార్చాలని సైన్డ్ ప్రాపర్టీ యజమానుల వినతి


బ్రిడ్జి నమూనాను వివరిస్తున్న జీహెచ్‌ఎంసీ ప్లానింగ్ ఈఈ గోపాల్

మలక్‌పేట: మూసారంబాగ్ బ్రిడ్జికి ఇరువైపులా ఉన్న అండర్ సైన్డ్ ప్రాపర్టీ యాజమానుల వినతి మేరకు మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల మూసారంబాగ్ బ్రిడ్జిని బుధవారం సందర్శించారు. ప్రతిపాదిత నమూనాలతో బ్రిడ్జి నిర్మాణం చేపడితే జీవనోపాధికి ఆధారమైన ప్రాపర్టీ కోల్పోయి నడిరోడ్డున పడతామని, తమకు న్యాయం జరిగేలా చూడాలని ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్నారు. అభివృద్ధి వ్యతిరేకం కాదని, ప్రతికూలంగా ఉన్న ప్రభావాలను తగ్గించడం కోసం నిర్మాణ నమూనాలో సవరణ చేయాలని కోరారు. జీహెచ్‌ఎంసీ ప్లానింగ్, ఇంజినీరింగ్ విభాగం అధికారులతో కలిసి ఆయన బ్రిడ్జిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బ్రిడ్జి నిర్మాణ ప్రతిపాదిన నమూనాలపై అధికారులతో సమీక్ష చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అండర్ సైన్డ్ ప్రాపర్టీ యాజమానులకు ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. బ్రిడ్జి నిర్మాణానికి మార్క్ చేసిన ప్రాపర్టీలో 75 శాతం వరకు కోల్పోకుండా నమూనాలు సవరణ చేయాలని అధికారులను కోరారు. జనవరి 3న మరోసారి అధికారులు, ప్రాపర్టీ యజమానులతో సమావేశం ఏర్పాటు చేసి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. జీహెచ్‌ఎంసీ ప్లానింగ్ ఈఈ గోపాల్, ఇంజినీరింగ్ విభాగం సర్కిల్–6 ఈఈ పీర్‌సింగ్, డీఈఈ ప్రదీప్, వెస్ట్ ప్రశాంత్‌నగర్ వర్తో వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, కోశాధికారి ధనుంజయ, ఉపాధ్యక్షుడు నిరంజన్‌సాగర్, సలహాదారులు అశోక్, దశరథ్‌గౌడ్, రవీందర్, ప్రకాశం, అశోక్, హమీద్ అన్సారీ, వెంకటేష్ పాల్గొన్నారు.

మురుగు.. పరుగు

- దుర్వాసనతో ఇబ్బంది పడుతున్న కాలనీవాసులు

నాగోలు: జీహెచ్‌ఎంసీ హయత్‌నగర్ సర్కిల్ పరిధిలోని నాగోలు డివిజన్‌లో ఎటు చూసినా.. డ్రైనేజీలు పొంగి పొర్లుతున్నాయి. దీంతో కాలనీవాసులు, బస్తీవాసులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. నాగోలు డివిజన్ పరిధిలోని ఆనంద్‌నగర్ చౌరస్తా, గోపాలకృష్ణపురం, అయ్యప్పనగర్ కాలనీ, మల్లికార్జుననగర్, శ్రీనివాస్‌నగర్, మమతనగర్, జైపురికాలనీ తదితర పరిసర ప్రాంతాల్లో డ్రైనేజీ పొంగి పొర్లుతోంది. మురుగు రోడ్లపై పారడంతో కాలనీవాసులు వ్యాధుల బారిన పడుతున్నారని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయ్యప్పనగర్ కాలనీ, శ్రీనివాస్‌నగర్ నిరంతరం డ్రైనేజీ పొంగి పొర్లుతోంది. దీనిపై అధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.


గోపాలకృష్ణపురంలో రోడ్డుపై పారుతున్న మురుగు

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటా..


ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డితో ఆర్‌కేపురం బీఆర్‌ఎస్ నేతలు

ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: ఎన్నికల్లో తన గెలుపునకు సహకరించిన ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. బుధవారం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ ఆధ్వర్యంలో ఆర్‌కేపురం నుంచి కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిసి వచ్చే ఎంపీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. ఈ సందర్భంగా సబిత మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాల మేరకు నియోజకవర్గంలోని పనులను దశలవారీగా పూర్తి చేస్తానన్నారు. వారంలో మూడురోజులు కార్యకర్తల ఇంటికెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకుంటానని తెలిపారు. న్యాలకొండ శ్రీనివాస్‌రెడ్డి, లింగస్వామిగౌడ్, కొండ్ర శ్రీనివాస్, శ్రీమన్నారాయణ, జాహిద్, జగన్, బాలుశ్రీ, కంచర్ల శేఖర్, పెంబర్తి శ్రీనివాస్, వాజిద్‌పటేల్, రమేష్, శ్రీకాంత్‌గౌడ్ తదితరులున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

చైతన్యపురి: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన చైతన్యపురి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ నాగార్జున తెలిపిన వివరాల ప్రకారం.. నాగోలులో నివసించే శ్రీరాం కార్తీక్ (35) ప్రైవేటు ఉద్యోగం చేస్తూ తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నాడు. కాగా ఏడాది క్రితం వివాహమైంది. భార్య చెన్నైలో ఉద్యోగం చేస్తోంది. బుధవారం ఉదయం భార్య ఫోన్ చేయగా కార్తీక్ లిఫ్ట్ చేయలేదు. దీంతో కార్తీక్ తండ్రి చంద్రశేఖర్‌కు ఫోన్ చేయడంతో మొదటి అంతస్తులోకి వెళ్లి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించాడు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం

మలక్‌పేట: మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల మలక్‌పేట ఏరియా ఆసుపత్రిలో వాటర్ ప్లాంట్‌ను బుధవారం ప్రారంభించారు. అనంతరం ఆసుపత్రి కోవిడ్ వార్డును సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఆక్సిజన్ బెడ్లు, వెంటిలేటర్లు, ఆక్సిజన్ ప్లాంట్ వంటి సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. కోవిడ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఆర్‌ఎం మల్లికార్జునప్ప, ఇన్‌చార్జి కరుణాకర్, వైద్యులు, సిబ్బంది, ఎంఐఎం నాయకులు పాల్గొన్నారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

చైతన్యపురి : దిల్‌సుఖ్‌నగర్‌లోని హైదరాబాద్–2 ఆర్టీసీ డిపో నుంచి నడిచే బస్సు సర్వీసులకు సంబంధించి ప్రయాణికుల నుంచి సలహాలు, సమస్యలు, ఫిర్యాదులు స్వీకరించేందుకు గురువారం సాయంత్రం 4 నుంచి 5 గంటల మధ్యలో డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ కృష్ణమూర్తి తెలిపారు. ఉద్గిర్, బీచ్‌కుండ్, జూకల్, కొల్హాపూర్, విజయవాడ, బైలడిల్లా, జగదల్‌పూర్, బెంగళూరు, తొర్రూర్ వెళ్లే బస్సులు ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రయాణికులు నేరుగా డీఎంతో మాట్లాడవచ్చని తెలిపారు. వివరాలకు 9959226249.

కేలండర్ ఆవిష్కరణ



చాదర్‌ఘాట్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఓల్డ్‌మలక్‌పేట డివిజన్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పీవీ నరసింహరావు చిత్రంతో ముద్రించిన నూతన సంవత్సర కేలండర్‌ను ఆయన పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పేద బలహీనవర్గాల సంక్షేమం కోసం రాష్ట్రప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కాంగ్రెస్ నాయకులు చౌకి రవికుమార్, రాధిక, ఆకుల రాజు, రామకృష్ణ, నోయల్, మంగళ పాల్గొన్నారు.

రోడ్ల విస్తరణకు కృషి

మహేశ్వరం: గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లను విస్తరించి అభివృద్ధికి తన వంతు కృషి చేస్తామని మహేశ్వరం ఎమ్మెల్యే పి సబితారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని మన్సాన్‌పల్లి–కోళ్లపడకల్ వయా ఘట్టుపల్లి బీటీ డబుల్ రోడ్డు నిర్మాణ పనులను ఆమె ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో మన్సాన్‌పల్లి– కోళ్లపడకల్ వయా ఘట్టుపల్లి డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ.15.20 కోట్ల నిధులను తను మంజూరు చేయించి రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించానని గుర్తు చేశారు. ప్రస్తుతం పనులు కొనసాగుతున్నాయన్నారు. అసంపూర్తి పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ఘట్టుపల్లి ప్రభుత్వ పాఠశాలను ఆమె సందర్శించి విద్యార్థులతో కలిసి ముచ్చటించారు. మన ఊరి–మన బడి ద్వారా ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించి అభివృద్ధి చేశానన్నారు. విద్యార్థులు ఒక ఉన్నతమైన లక్ష్యాన్ని ఎంచుకొని కష్టపడి చదవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీపీ సునీతా నాయక్, ఘట్టుపల్లి సర్పంచ్ కోరుపోలు అనితారెడ్డి, ఉప సర్పంచ్ మేకల శ్రీనివాస్ యాదవ్, వార్డు సభ్యులు విష్ణువర్ధన్‌రెడ్డి, బి. రవి, బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఎర్ర శంకరయ్య ప్రభాకర్‌రెడ్డి, పాల్గొన్నారు.


రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న సబితారెడ్డి

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం


మాట్లాడుతున్న ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం: అందరి సమిష్టి కృషి వల్లే ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీకి ఇంతటి అఖండ విజయం సాధ్యమైందని నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే తన లక్ష్యమని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. తన గెలుపు కోసం అహర్నిశలు కృషిచేసిన నాయకులు, కార్యకర్తలు, కాలనీ సంక్షేమ సంఘాలు, ఆయా సంస్థలు, తదితరుల కోసం బుధవారం వనస్థలిపురం డివిజన్ హస్తినాపురం జీఎస్‌ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించిన కృతజ్ఞతా సభా కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీకి తిరుగులేదని, కార్యకర్తలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. నియోజకవర్గంలో ప్రధాన సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామన్నారు. భవిష్యత్తులో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుపుతామన్నారు. ఎమ్మెల్సీలు ఎగ్గె మల్లేశం, దయానంద్ గుప్తా, ఎల్‌బీనగర్ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్ ముద్దగోని రామ్మోహన్‌గౌడ్, మాజీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు, ఉద్యమకారులు, పలు విభాగాల చైర్మన్లు, డివిజన్ల అధ్యక్షులు, మహిళా నేతలు, యువత, పలు కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

రూ.16 లక్షలతో సీసీరోడ్డు పనులు


రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

మలక్‌పేట: కృష్ణ తులసినగర్‌లో రూ.16 లక్షల జీహెచ్‌ఎంసీ నిధులతో సీసీరోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. కార్పొరేటర్ కాలనీవాసులతో కలిసి బుధవారం రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతామని, డివిజన్‌లోని అన్ని కాలనీల్లో రోడ్లు సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సకాలంలో అభివృద్ధి చేయాలని ఆదేశించారు. జీహెచ్‌ఎంసీ సైట్ ఇంజినీర్ ఏడుకొండలు, బీజేపీ నాయకులు యాదగిరి సురేందర్, కొంగర ప్రవీణ్, శశికాంత్, దినేష్, కిరణ్, విశాల్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ ఏజెన్సీల వద్ద పడిగాపులు



కర్మన్‌ఘాట్ వద్ద ఈకేవైసీ కోసం బారుల తీరిన వినియోగదారులు

చంపాపేట: కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన మహాలక్ష్మి పథకంలో భాగంగా రూ.500లకే గ్యాస్ సిలిండర్‌ను పొందేందుకు ఈకేవైసీ తప్పనిసరి అని పుకార్లు రావడంతో ఎల్‌బీనగర్ జోన్ పరిధిలోని పలు గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ సెంటర్ ఎదుట వినియోగదారులు భారీ ఎత్తున బారులు కడుతున్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. రూ. 500లకే గ్యాస్ సిలిండర్ అని రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి అధికార ప్రకటన రానప్పటికీ ఈనెల 31 లోపు ఈకేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలని పుకార్లు రావటంతో గ్యాస్ వినియోగదారులు గ్యాస్ పాస్‌బుక్, ఆధార్, ఓటర్ ఐడీ, బ్యాంక్ పాస్ బుక్ వంటి ఆధారాలతో గంటల తరబడి గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ సెంటర్ ఎదుట క్యూలైన్‌లో వేచి ఉండి బయోమెట్రిక్ నుంచి వేలిముద్రలు, ఐరిష్ , ఇతర ఆధారాలను ఏజెన్సీ సిబ్బందికి అందచేస్తున్నారు.

వినియోగదారుడి సమగ్ర సమాచారం కోసమే..

గ్యాస్ కనెక్షన్ పొందిన వ్యక్తి గ్యాస్ పొందుతున్నాడా.. లేదా ఇతరులకు ఏమైనా మార్పిడి చేశాడా.. వంటి గ్యాస్ వినియోగదారుడి సమగ్ర సమాచారం కోసమే కేంద్ర ప్రభుత్వం చమురు మార్కెటింగ్ కంపెనీల ద్వారా ఈకేవైసీ అప్‌డేట్ చేయమనే ఆదేశాలు వచ్చాయని గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ సెంటర్ నిర్వాహకులు స్పష్టం చేస్తున్నారు.

నిర్దిష్ట సమయమేమి లేదు..

ఈకేవైసీ చేసుకునేందుకు ఎలాంటి నిర్దిష్ట సమయం లేదని ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్ సెంటర్‌కు రావల్సిన పనిలేదని వినియోగదారుడి ఇంటికే గ్యాస్ డెలివరీ బాయ్ వచ్చి కైవైసీ ప్రక్రియ పూర్తి చేస్తారని సెంటర్ నిర్వాహకులు స్పష్టం చేస్తున్నారు.

రూ.500లకే గ్యాస్ అని వచ్చాం..



ఈకేవైసీ చేసుకుంటే మహాలక్ష్మి పథకం ద్వారా రూ. 500లకే గ్యాస్ సిలిండర్ ఇస్తారనే ఈకేవైసీ కోసం గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ సెంటర్‌కు వచ్చాం. గ్యాస్ డెలివరీ బాయ్‌ను ఈకేవైసీ చేయమని అడిగితే డిస్ట్రిబ్యూటర్ సెంటర్‌కే వెళ్లమని చెప్పాడు. ఉదయం 9 గంటల నుంచి వేచి చూస్తున్నాం. 10 గంటలకు ఆఫీసు తెరిచారు. కేవైసీ చేసేందుకు సిబ్బంది తక్కువగా ఉన్నారు. రోజంతా ఎదురు చూసినా ఈకేవైసీ అయ్యేటట్లు లేదు.

– పద్మ, కర్మన్‌ఘాట్

పడిగాపులు తప్పడం లేదు..



గ్యాస్ పై సబ్సిడీ, మహాలక్ష్మి పథకం ద్వారా రూ. 500లకే గ్యాస్ అవకాశాన్ని కోల్పోతామనే భయంతోనే ఈకేవైసీ కోసం రెండు రోజుల నుంచి గాస్ డిస్ట్రిబ్యూటర్ సెంటర్ ముందు పడిగాపులు కాస్తున్నాను. సెంటర్ ముందు ఎటువంటి సౌకర్యాలు లేవు. గ్యాస్ డెలివరీ బాయ్ ఇంటికే వచ్చి ఈకేవైసీ చేయాలి.

– జయంతి, బైరామల్‌గూడ